క్లుప్తంగా

భోజనశాల ప్రారంభం



భోజనశాలను ప్రారంభిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు

ఆకివీడు: స్థానిక గుమ్ములూరు రోడ్డులో వేంచేసి యున్న దానేశ్వరి అమ్మవారి ఆలయంలో నూతనంగా నిర్మించిన భోజనశాలను ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధర్ రావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చే భక్తులకు భోజనశాల ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆలయ ట్రస్ట్, దాతలు సహకారంతో భోజనశాల నిర్మాణం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ బండారు జలదుర్గాప్రసాద్, మోటుపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి



భీమవరంలో కౌలురైతుల శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న హరిబాబు

భీమవరం: సార్వా పంటకు సమయంలో మిచౌంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం వెంటనే విడుదల చేయాలని కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు అన్నారు. ఆదివారం భీమవరంలో ఏర్పాటు చేసిన కౌలురైతుల సంఘం రాష్ట్ర శిక్షణా తరగతులు రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ కౌలు రైతుల చట్టానికి సవరణ చేసి భూయజమానులతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం.సూర్యనారాయణ, బి.రామకృష్ణ టి.గోపాల్ పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమ పూజలు



ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మొగల్తూరు: ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని ప్రధాన వీధుల మీదుగా పల్లకిలో ఊరేగించారు. అనంతరం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గణపతి పూజ, వాసవీ పూజ, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పూజలు అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణను ఏర్పాటు చేయడంతో గ్రామానికి చెందిన భక్తులు తరలి వచ్చి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కారుమూరి రవి, రాంబాబు, నాగళ్ళ నాగు, మానేపల్లి చిన్న, గ్రంధి శ్రీను, కారుమూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

పాలకొల్లు అర్బన్: ఆరోగ్యశ్రీ వర్తించని రోగులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందజేయడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం యలమంచిలి మండలం మేడపాడుకు చెందిన కుక్కల సోనికి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.10 వేలు చెక్కును గుడాల గోపి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుర్రాల వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉచ్చుల స్టాలిన్, వీరా ఉమాశంకర్ పాల్గొన్నారు.

వంటశాల నిర్మాణానికి శంకుస్థాపన

యలమంచిలి: మేడపాడు గ్రామ దేవతలు వెంకమ్మ, కనకదుర్గమ్మ, జువ్వాలమ్మ అమ్మవార్ల ఆలయంలో ప్రతి శుక్రవారం ఆలయానికి వచ్చే భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నారు. వంటపాత్రలు ఉంచడానికి అవసరమైన వంటశాల లేకపోవడంతో ఇబ్బంది ఎదురవుతుంది. ఈ విషయం ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ దృష్టికి వెళ్లడంతో ఆమె హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న తన సోదరుడు అడబాల రామ్‌ప్రసాద్‌కు వివరించారు. ఆయన స్పందించి తన తండ్రి వీరాస్వామి పేరిట రూ.50 వేలు విరాళం ఇచ్చారు. దీంతో వంటశాల నిర్మాణానికి ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ, వెంకటేశ్వరరావు దంపతులు ఆదివారం శంకుస్థాపన చేశారు.

ఈ-క్రాప్..రైతు సేవల్లో భేష్

భీమవరం అర్బన్: రైతు బాగుంటేనే రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చెందుతుందని భావించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికి, వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నారు. సాగు ప్రయోజనాలు సక్రమంగా అందించేందుకు ప్రవేశపెట్టిన ఈ క్రాప్ విధానం రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తుంది. ఆరుగాలం శ్రమించే కర్షకులకు మరింత మేలు చేసే విధంగా రైతులకు ఆర్‌బీకే సెంటర్లో కియోస్క్ ద్వారా నాణ్యమైన ఎరువులు, పురుగుమందులను, సబ్సిడీ విత్తనాలను బుక్‌చేసుకున్న 48గంటల్లో అందజేసేవిధంగా చర్యలు తీసుకున్నారు.



మండలంలోని రాయలం గ్రామంలో పంట పొలంలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న దృశ్యం

ఈ క్రాప్ నమోదుతో ప్రయోజనాలెన్నో..

ఈ క్రాప్ నమోదు చేసుకోవడం ద్వారా పంటల బీమా, నష్టపరిహారం చెల్లించడం, వేసిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, సాగులో అవసరమయ్యే ఎరువులు, పురుగు మందులు, పెట్టుబడి సాయం అందించడం, వైఎస్సార్ యంత్ర సేవా పథకం అమలు, సున్నా వడ్డీ పంట రుణాలు అందించడం, మెట్టలో ఉచిత విద్యుత్, ఉచిత బోర్లు ఇలా ఎన్నో రైతుల సంక్షేమానికి రూపొందించి అమలు చేస్తున్న పథకాలకు లబ్ధి పొందడం సులభతరమవుతుంది. ఈ క్రాప్‌లో భాగంగా ఆర్‌బీకే స్థాయిలో ప్రతి రైతు వివరాలు నమోదు చేస్తున్నారు. దీని వల్ల పంట అమ్ముకునే సమయంలో ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా రైతులను వెసులుబాటు కల్పించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మూడున్నరేళ్లుగా పంట బీమాను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు.

ఆర్‌బీకేల్లో నమోదు

ఈ- క్రాప్‌లో భాగంగా రైతులు, కౌలు రైతులు తమ పేర్లను రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అనంతరం ఆయా ప్రాంతాల్లో రైతుల సాగు విధానాన్ని వ్యవసాయాధికారులు పరిశీలించి నమోదు చేస్తారు.

మండలంలో 90 శాతంపై ఈ క్రాప్ నమోదు

మండలంలో యనమదుర్రు, దిరుసుమర్రు, తాడేరు, బేతపూడి, తుందుర్రు, కొవ్వాడ అన్నవరం, రాయలం, చినఅమిరం, అనాకోడేరు, కొమరాడ తదితర గ్రామాలలో సుమారు 8 వేల 300 ఎకరాలకు శ్రీకారం చుట్టారు. సాగులో ప్రయోజనాలను రైతులకు చేకూరే ఈ - క్రాప్ నమోదును వ్యవసాయ సిబ్బంది 90 శాతం పైగా ఈ క్రాప్ నమోదు చేశారు. ఏటా భారీ వర్షాలు, తుఫాన్‌ల వల్ల కొన్ని ప్రాంతాలలో సాగు దెబ్బతినడంతో రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకుంటే ఎంతో మేలు జరగడంతో పాటు రైతులు పండించిన ధాన్యాన్ని ఇబ్బందులు లేకుండా విక్రయించుకోవచ్చు.

ప్రభుత్వం రైతులను ఆదుకుంటుంది



పంట ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతింటే ఈ - క్రాప్ నమోదుతో పంట నష్ట పరిహారం నేరుగా రైతు ఖాతాలో జమ చేస్తున్నారు. ఈ విధానం వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం రైతులకు చేకూరుతుంది. కాళ్లరిగేలా వ్యవసాయ శాఖ కార్యాలయం చుట్టూ తిరిగే పని ఉండదు. ప్రభుత్వం ఇచ్చే ప్రతి ఫలం పక్కాగా రైతులకు అందుతుంది.

– కొట్టి కుటుంబరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్, బేతపూడి

రైతులకు ఎంతో మేలు



ఈ-క్రాప్ నమోదువల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రతి రైతు పండిస్తున్న పంట వివరాలను తప్పకుండా నమోదు చేయించుకోవాలి. మండలంలో 13 వ్యవసాయాధిరిత గ్రామాలలో 8వేల 300 ఎకరాలలో దాళ్వా సాగు చేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 90 శాతం పైగా ఈ క్రాప్ నమోదు చేశాం. మిగిలిన రైతులు త్వరగా ఈ - క్రాప్ నమోదు చేయించుకోవాలి.

– నిమ్మల శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి, భీమవరం

ఘంటసాల పాటలు అజరామరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తెలుగు సినీ సంగీతంలో విభిన్నమైన వ్యక్తి ఘంటసాలని, ఆయన పాడిన పాటలు అజరామరాలని ఘంటసాల గానసభ అధ్యక్షుడు ఎస్.కాసిం, బీవీఆర్ వ్యవస్థాపకుడు బుద్దాల వెంకట రామారావు, అంతర్జాతీయ శిల్పి దేవికారాణి ఉడయార్ కొనియాడారు. ఘంటసాల 50వ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక వీకర్స్ కాలనీలోని ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గానసభ కార్యదర్శి డి.కృష్ణ, తబలా విద్వాన్ శంకరరావు, డి.బాలాజీ, సిల్క్ సాహెబ్, జీజేకే మూర్తి (హైదరాబాద్), యువ గాయకులు నజీరుద్దీన్, మన్సూర్, నాగూర్, సీరా కొండలరావు, రాంబాబు, బాబూరావు హాజరయ్యారు. సాయంత్రం బీవీఆర్‌లో ఘంటసాల గానసభ ఆధ్వర్యాన సంగీత విభావరి నిర్వహించారు. జిత్ మోహన్ మిత్ర ఆర్కెస్ట్రా వ్యవస్థాపకుడు, సినీ నటుడు, ప్రఖ్యాత గాయకుడు శ్రీపాద జిత్ మోహన్ మిత్రా (రాజమండ్రి)కు ఘంటసాల అవార్డు ప్రదానం, నాదస్వర విద్యాంసులు నాగూర్ సాహెబ్, మదీన్ బీబీ అవార్డును బీవీఆర్ కళాకేంద్రం సహాయ కార్యదర్శి, ప్రముఖ నర్తకుడు, నటుడు పీటీ వెంకన్నకు అందజేశారు. కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.



ఘంటసాలకు నివాళులర్పిస్తున్న కళాకారులు, పట్టణ ప్రముఖులు

మధుర గాయకుడు ఘంటసాల

తణుకు టౌన్: తెలుగు సినీ సాహిత్యంలో మధుర గాయకుడు ఘంటసాల పాటలు చిరస్మరణీయంగా నిలుస్తాయని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా తణుకులోని ఎన్టీఆర్ పార్క్ వద్ద గల ఆయన విగ్రహానికి మాజీ కౌన్సిలర్ వావిలాల సరళాదేవి ఆధ్వర్యాన పూలమాల వేసి నివాళులర్పించారు. గాయకుడు ఘంటసాల పాటలపై పలువురు వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో వావిలాల వెంకట పవన్ కుమార్, ఆర్కెస్ట్రా రాజు, సితారె, షణ్ముఖి విజయకుమార్ రాజు, మిమిక్రీ రాము, పి.లక్ష్మి, వరహాలు, రమణ తదితరులు పాల్గొన్నారు.

మధుమేహ వ్యాధి పట్ల అశ్రద్ధ వద్దు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మధుమేహ వ్యాధి పట్ల అశ్రద్ధ చూపవద్దని లయన్స్ క్లబ్ జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు సూచించారు. స్థానిక ఆర్ అండ్ బీ గ్రౌండ్‌లో ఆదివారం డైమండ్స్ క్లబ్ ఆధ్వర్యాన పాలకొల్లు విజయ ల్యాబ్ అధినేత కొమ్ముల మురళీకృష్ణంరాజు సౌజన్యంతో ఉచిత మధుమేహ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వాకర్స్, షటిల్ ప్లేయర్స్, ఫైర్ సిబ్బందికి రక్త పరీక్షలు చేశారు. మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ అన్ని వయస్సుల వారిని బాధిస్తున్న మహమ్మారి మధుమేహమని, గుర్తించగానే నియంత్రణపై శ్రద్ధ చూపాలని, నడక, తగిన వ్యాయమం, యోగా ఎంతో అవసరం అన్నారు. ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలని కోరారు. షుగర్ వ్యాధి ఉంటే నిపుణులైన వైద్యులను సంప్రదించాలని సూచించారు. కంచర్ల ఆయుర్వేదం నిర్వాహకులు కంచర్ల నరసింహ షుగర్ వ్యాధిగ్రస్తులకు హెర్బల్ మందును ఉచితంగా అందజేశారు. మానేపల్లి కిరణ్, జి.మురళీకృష్ణ, యర్రా ఆంజనేయస్వామి, కుందుం వెంకటేశ్వరరావు, రెడ్డి సత్యనారాయణ, డి.ముఖర్జి, పి.రామకృష్ణ అభయం, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రతిరోజూ వ్యాయామం తప్పక చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతిరోజూ వ్యాయమం తప్పక చేయాలని వాకర్స్ అధ్యక్షుడు దూలం నాగరాజు అన్నారు. పట్టణంలో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. నాగరాజు మాట్లాడుతూ ఆరోగ్యం కోసం నడక, రన్నింగ్, యోగా, వ్యాయమాలు చేయాలని సూచించారు. ఇటీవల దివంగతులైన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, అసోసియేషన్ లైఫ్ సభ్యుడు పీఎల్ఎన్ మాస్టార్ స్మృత్యర్థం మౌనం పాటించారు. కార్యదర్శి చిప్పాడ గురుమూర్తి, కోశాధికారి మల్లారెడ్డి సారధి, జిల్లా డిప్యూటీ గవర్నర్ ప్రవా శ్రీనివాస్, పూర్వ అధ్యక్షుడు కేవీ చలం, రాగిరెడ్డి నాగ వరప్రసాద్, బాకా వెంకటేశ్వరరావు, పి.కుమారస్వామి, ఏఆర్‌కే సత్యనారాయణ మూర్తి, కోపల్లె శ్రీనివాస్, యోహాను, జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ అధ్యక్షుడు దూలం నాగరాజు

పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం



అనురాధ రూరల్ ఎడ్యుకేషనల్ సొసైటీలోని విద్యార్థులతో డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెంటపాడులోని డీఆర్ గోయెంకా డిగ్రీ కళాశాల 1986–89 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పూర్వ విద్యార్థులు ఆదివారం ఉంగుటూరు గ్రామానికి వెళ్లి గ్రామంలోని అనురాధ రూరల్ ఎడ్యుకేషనల్ సొసైటీలోని పిల్లలకు అన్నదానం, విద్యాసామగ్రి కిట్‌లు అందజేశారు. ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ఇచ్చారు. పూర్వ విద్యార్థులు తాడేపల్లిగూడేనికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ నున్న వీర వెంకట సాయి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ 6వ వార్డు మాజీ కౌన్సిలర్ పైబోయిన వైదేహీ, అందె చంద్రశేఖర్, సొసైటీ మేనేజర్ విజయ, వింగ్స్ ఆఫ్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామీణ భారత్ సమ్మెను విజయవంతం చేయండి

వీరవాసరం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 16న తలపెట్టిన గ్రామీణ భారత్ సమ్మెను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జుత్తిగ నరసింహమూర్తి, ఆకుల హరేరామ్ కోరారు. ఆదివారం వీరవాసరంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మండలంలోని అన్ని గ్రామాల్లో సమ్మె విజయవంతం కోరుతూ ప్రచారం చేయాలని తీర్మానించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలపై పన్నుల రూపంలో దాడి చేస్తోందన్నారు. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చడం కోసం నిధులు కేటాయించడం, ప్రణాళికలు రూపొందించడం ద్వారా మాత్రమే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. గత పదేళ్లలో విశాఖ ఉక్కు వంటి పరిశ్రమను నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. సమావేశంలో కె.సత్తిబాబు, నాగరత్నం, వరలక్ష్మి, నిర్మల, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

బాల సుబ్రహ్మణ్యుని సన్నిధిలో పీవీఎల్

ఉండి: ఎన్నార్పీ అగ్రహారం బీసీ కాలనీలో వేంచేసియున్న బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్ఠను పురస్కరించుకుని ఆదివారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ప్రత్యేక పూజలు చేశారు. తొలుత కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ రాష్ట్రంలో కులమతాలు, రాజకీయాలకు అంతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మరింత సంక్షేమంతో జీవించాలని దేవుడ్ని ప్రార్థించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మునుకోలు సింహాచలం, గలావిల్లి ధనుజయ, కరిమెరక శివనాగరాజు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఉండి: మండలంలోని పాములపర్రులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. గణపవరం రోడ్డులో పాములపర్రు వద్ద ఉండి వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని భీమవరం వైపు వెళుతున్న లారీ ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనదారుడి కాలు విరిగింది. దీంతో అతన్ని భీమవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుని సోదరుడు దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

ఉండి: వివాహిత అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండి భవానిపేట యానాదుల కాలనీకి చెందిన మర్రి ఝాన్సీ ఈనెల 9వ తేదీన తన 8 నెలల కుమారుడిని తీసుకుని ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. ఆమె తిరిగి రాలేదు. దీంతో భర్త ప్రసాద్ ఆమె ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుపై హెడ్ కానిస్టేబుల్ యెషయా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కనకరత్నమాలకు అవార్డు

పెనుగొండ: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఏపీ సీనియర్ సిటిజన్ నార్త్ మహిళా విభాగ్ అధ్యక్షురాలు కొత్త కనకరత్నమాల వెంకటేశ్వర్లు చెన్నై త్యాగరాయనగర్ లో నేషనల్ ఒమెన్స్ కాన్ఫరెన్స్‌లో అపరాజిత షైనింగ్ స్టార్ అవార్డును స్వీకరించారు. ఆదివారం జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో అవార్డును స్వీకరించారు. ఈ మేరకు రత్నమాల వివరాలను తెలుపుతూ కార్యక్రమంలో గ్లోబల్ కన్వీనరు టీజీ వెంకటేష్, గ్లోబల్ ప్రెసిడెంట్ రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ జ్యోతి ప్రసాద్, గురుప్రసాద్, మాజీ శాసన సభ్యుడు అంబికా కృష్ణ పాల్గొన్నట్లు తెలిపారు.

మందాలమ్మకు బంగారు నేత్రాల సమర్పణ

పెనుగొండ: మండలంలోని వడలి గ్రామ దేవత మందాలమ్మ అమ్మవారికి సంకురాత్రి సుబ్బారావు, రాఘవ దేవి దంపతుల కుమారులు వెంకట ఆదిత్యా శ్రీనివాస్, దుర్గా ప్రతాప్ కుటుంబ సభ్యులు రూ.74 వేలు విలువైన బంగారు నేత్రాలు సమర్పించారు. ఆదివారం బంగారు నేత్రాలను కమిటీ సభ్యులకు అందించారు. దాతలకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమ పాలనకు చిరునామా సీఎం జగన్

ఉండి: పేదల సంక్షేమానికి చిరునామా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఆదివారం ఆయన స్వగ్రామం యండగండిలో విశాల సహకార సంఘం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన జనరిక్ మందులషాపు, ఏటీఎంను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ పేదలు, రైతుల పక్షాన నిలబడి వారికి మరింత మంచి జరిగేలా యండగండి గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యాన జనరిక్ మందుల షాపును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రజలంతా ఈ మందుల షాపును వినియోగించుకోవాలని సూచించారు. బ్యాంక్ కార్యదర్శి సీహెచ్ రవికుమార్ మాట్లాడుతూ గతంలో మొబైల్ ఏటీఎంను ఏర్పాటు చేశామని, ఇప్పుడు బ్యాంక్ ఆవరణలో ఏటీఎం రైతులు, ఖాతాదారులకు నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు పాలకవర్గ సభ్యులు దాట్ల కామరాజు, పైడి రామారావు, ఖాతాదారులు, రైతులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



జనరిక్ మందుల షాపును ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

మత్తు రహిత సమాజాన్ని స్థాపించాలి

భీమవరం: జమాతే ఇస్లామి హింద్ సంస్థ నిర్వహిస్తున్న 'రండి! మత్తు రహిత సమాజాన్ని స్థాపిద్దాం' రాష్ట్ర వ్యాప్త అవగాహన ఉద్యమంలో భాగంగా ఆదివారం భీమవరం పట్టణంలోని ముస్లిమ్స్ కమ్యూనిటీ హాల్లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు సయ్యద్ ఫర్హాన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణ ఉద్యమ కన్వీనర్ ముహమ్మద్ సిద్దీఖ్ మాట్లాడుతూ సమాజంలో మత్తు పదార్థాల వినియోగం, డ్రగ్స్ లాంటి మాదక ద్రవ్యాల వినియోగం విపరీతంగా పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాల ప్రభావంవల్ల అనేకమంది మానసిక, శారీరక వ్యాధులకు గురి కావడమేగాక సమాజంలో నేరాలు, ఘోరాలు కూడా పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించడానికి ఈ నెల 18వ తేది వరకూ అవగాహన ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భీమవరం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు యేలేటి న్యూటన్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంపై ప్రభుత్వాలు నిషేధం విధించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కరీముల్లా, గంగయ్య, కె క్రాంతిబాబు, విశాలాక్షి, మునవర్ కమాల్ పాషా, జి ధనుష్, అబ్దుల్ వహీద్ తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ముహమ్మద్ సిద్దీఖ్

ఓపెన్ స్కూళ్లను సద్వినియోగం చేసుకోండి

ఆకివీడు: చదువు మధ్యలో ఆపేసిన వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పిస్తూ ఏర్పాటు చేసిన ఓపెన్ స్కూళ్లను సద్వినియోగం చేసుకోవాలని అపోస్ జిల్లా ఇన్‌చార్జి ఎస్.సత్యనారాయణ సూచించారు. స్థానిక విద్యా వికాస్ ప్రైవేట్ స్కూల్‌లో ఓపెన్ స్కూల్ తరగతులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థులు, చిరు వ్యాపారాలు, వాహనాలు నడుపుతూ జీవనం గడుపుతున్న వ్యక్తులు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివి సర్టిఫికెట్ల ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. ఓపెన్ స్కూల్‌లో చదివేందుకు ఈ ఏడాది విద్యార్థులు అధిక సంఖ్యలో ఆసక్తి చూపి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. విద్యార్థులు ప్రతి ఆదివారం తరగతులకు హాజరై విద్యను అభ్యసించి, పఠనాసక్తిని పెంచుకుని పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలని ఆయన సూచించారు.



విద్యార్థుల పఠనాసక్తిని పరిశీలిస్తున్న అపోస్ జిల్లా ఇన్‌చార్జి ఎస్.సత్యనారాయణ

కల్యాణం.. కమనీయం



శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వార్ల కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

తాడేపల్లిగూడెం అర్బన్: దేవాదాయ శాఖ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యాన చేపట్టిన ధర్మ ప్రచార మహోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ బలుసులమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై ఉదయం 10 గంటలకు విశాఖపట్టణంలో వేంచేసి యున్న శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళలు విశేషంగా హాజరై సామూహిక కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.

వైభవంగా శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివార్ల కల్యాణం

ఉదయం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించిన వేదికపైనే సాయంత్రం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివార్ల కల్యాణం నిర్వహించారు. స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు విశేషంగా హాజరై తిలకించారు. కల్యాణం అనంతరం తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆయా దేవస్థానాల అధికారులు, సిబ్బందితో పాటు శ్రీ బలుసులమ్మ అమ్మవారి దేవస్థానం ఈవో రవిశంకర్, వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్, కర్రి భాస్కరరావు, ఆలయ చైర్మన్ కొట్టు అంజిబాబు, గార్లపాటి వీరబాబు, వట్టిప్రోలు రాము, అప్పన రమేష్ కుమార్, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

వైభవంగా అతిరుద్ర మహాయాగ మహోత్సవాలు

పోడూరు: మండలంలోని కవిటం గ్రామంలో శ్రీ సహస్రచండీ సహిత మహాసౌర పూర్వక చతుర్వేద స్వాహాకార సహిత దశ మహావిద్యా పూర్వక అతిరుద్ర మహాయాగ మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పెనుమంట్ర మండలం నెలమూరుకు చెందిన శ్రీ ఉమా రామలింగేశ్వర ట్రస్ట్, శర్వాణీ స్కూల్ ఆధ్వర్యంలో దాతలు, భక్తులు, గ్రామస్తుల సహకారంతో ఈ యాగ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. యాగమహోత్సవాల్లో భాగంగా అతిరుద్ర యాగం, గణపతిపూజ, గోపూజ, పుణ్యాహవాచనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు జ్యోతిప్రజ్వలన చేసి యాగమహోత్సవం, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక వేత్త జంధ్యాల శ్రీనివాస శర్మ(నెలమూరు శర్మ), కవిటం సొసైటీ చైర్మన్ కర్రి శ్రీనివాసరెడ్డి, మండ కాశీవిశ్వనాధరెడ్డి, సత్తి రామచంద్రారెడ్డి, మేడపాటి తమ్మిరెడ్డి, గాదె శ్రీనివాసరావు, పడాల సత్యనారాయణరెడ్డి, సత్తి మురళీకృష్ణారెడ్డి , కర్రి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కవిటంలో అతిరుద్ర యాగమహోత్సవాల్లో మాజీ మంత్రి, చెరుకువాడ శ్రీరంగనాథరాజు